## మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఆదిలాబాద్ డీఈవో ప్రణీత

ఇచ్చోడ, జూలై 16 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత సూచించారు. మంగళవారం ఇచ్చోడలోని కేజీబీవీని తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు సమాధానాలు ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఉపాధ్యాయులు నెల వారి సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. వెనుక బడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆమె వెంట కేజీబీవీ ప్రత్యేకాధికారి సంధ్యారాణి, డీఈవో సీసీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్

ఉట్నూర్, జూలై 16 : ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేయాలని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్‌లోని హనుమన్ మందిర సమీపంలో ఆ సంఘం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం 18 కులాలకు వర్తించేలా కేటాయించడం జరిగింది. కానీ 2023 నుంచి లబ్ధిపొందడం జరగలేదన్నారు. ఈ పథకాన్ని బీసీ కుల వృత్తులు, అందులో నాయిబ్రాహ్మణులు, రజకులు ఆన్‌లైన్ చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి శిక్షణ ఇవ్వాలని కోరారు. బీసీలో ఉండే కులవృత్తులను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణనలో చేర్పించి ప్రత్యేకంగా రాజకీయంగా పంచాయతీ రాజ్ చట్టంలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పుండలిక్, ప్రవీణ్, దేవయ్య, వెంకటేశ్, సాయి, రమణ, వెంకటరమణ, మల్లేశ్, భూమేశ్, సచిన్, చంద్రయ్య పాల్గొన్నారు.

## ఐకమత్యానికి నిదర్శనం పీరీల పండగ

తలమడుగు, జూలై 16 : కుల, మతాలకు అతీతంగా నిర్వహించే పీరీల పండుగ మన ఐకమత్యానికి నిదర్శనమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం రుయ్యాడి గ్రామంలోని హస్సేన్-హుస్సేన్ దేవస్థానాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పాడి పరిశ్రమల మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి దర్శించుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి, మాజీ చైర్మన్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ఎల్చాల దత్తాత్రేయ, మండల కన్వీనర్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు అబ్దుల్లా పాల్గొన్నారు.


ఎమ్మెల్యే, మాజీ మంత్రిని శాలువాతో సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

# దంచి కొట్టిన వర్షం

- పంట పొలాల్లోకి చేరిన నీరు
- జలమయమైన రోడ్లు
- పరుగులు తీసిన వాగులు

ఎదులాపురం, జూలై 16 : ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి మోస్తరుగా కురిసిన వర్షం మధ్యాహ్న సమయంలో దంచి కొట్టింది. జిల్లాలోని బోథ్ మండలం సొనాలలో 78 మిల్లీ మీటర్లు, జైనథ్ మండలం బోరజ్‌లో 25, ఇచ్చోడలో 16, బేలలో 15, ఆదిలాబాద్ పట్టణంలో 13.5 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


ఇంద్రవెల్లి: వరదతో పరుగులు తీస్తున్న హర్కాపూర్ వాగు

బోథ్, జూలై 16 : సోనాల, బోథ్, కౌఠ(బీ), ధన్నూర్(బీ) ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. కొద్ది రోజులుగా సరైన వర్షం లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఎట్టకేలకు వరుణదేవుడు కరుణించి పంట ఎదుగుదలకు కావాల్సిన వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పత్తి, సోయా, కంది తదితర పంటలకు ఎరువులు వేయడానికి సన్నద్ధమవుతున్నారు.

ఇంద్రవెల్లి, జూలై 16: మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు బుద్ధనగర్‌లోని అంతర్గత సీసీ రోడ్లు వర్షపు నీటితో జలమయమైంది. రోడ్లపై భారీగా వరద చేరడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. వాగులు, వంకలు వరదతో పరుగులు తీశాయి. గ్రామాల్లోని మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురువడంతో ప్రజలు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


బోథ్: సోనాలలో కురుస్తున్న వర్షం


తంతోలిలో పొలంలో కాల్వ ద్వారా బయటకు వెళ్తున్న వర్షపు నీరు

ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూలై 16 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలోని దిగువ ప్రాంతంలో ఉన్న పంట పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తమ పొలాల నుంచి నీరు పారేందుకు కాల్వలు తీశారు. కానీ కొందరు రైతులకు కాల్వ తీయరాకుండా ఉన్న భూములకు నష్టం వాటిల్లుతుంది.

## బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

ఉట్నూర్, జూలై 16 : సమగ్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని టీపీటీఎఫ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావ్ మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్భూగుప్తాకు ఆ సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, రవీందర్, వికాస్, సంజయ్, మంగాల్సింగ్ ఉన్నారు.

## మురుగు నీరు తొలగింపు

ఎదులాపురం, జూలై 16 : మున్సిపల్ కార్యాలయం ఎదుట మురుగు నీరు నిల్వ ఈ నెల 14వ తేదీన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ స్పందించారు. మంగళవారం మురుగునీరు నిల్వ సమస్యను మున్సిపల్ కార్మికులతో తొలగించి శాశ్వత పరిష్కారం చూపారు. దీంతో స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను అభినందించారు.


నిలిచిన మురుగు నీటిని తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

## తప్పని ప్రజాపాలన తిప్పలు

నిర్మల్ అర్బన్, జూలై 16 : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అందించే పలు రకాల పథకాల్లో అర్హులుగా గుర్తించేందుకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఇంత వరకు బాగానే ఉన్న ప్రజాపాలన దరఖాస్తులను సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో పలు పథకాల్లో అర్హులు కావాల్సిన వారు అనర్హులయ్యారు. దీంతో అన్ని అర్హతలు ఉన్న తమను ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సరి చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆన్‌లైన్‌లో సరిగ్గా వివరాలు నమోదు చేయాలని కోరుతున్నారు.


దరఖాస్తులను సరి చూసుకుంటున్న ప్రజలు

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

భైంసా, జూలై 16 : భైంసాలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రౌడీ షీటర్లను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అవినాశ్ కుమార్ మాట్లాడుతూ ఎలాంటి క్రిమినల్ కేసులలో ప్రమేయం కావద్దని హెచ్చరించారు. ఎవరైనా సత్ప్రవర్తనతో ఉంటే పై అధికారుల అనుమతితో రౌడీ షీట్ తొలగించుటకు సిఫార్సు చేస్తానన్నారు. నేరాలలో పాల్గొన్న లేదా ముఖ చర్యలకు పాల్పడినా పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్స్ యొక్క కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని అన్నారు. అంతేగాకుండా రాబోయే గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేటట్లు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట పట్టణ సీఐ రాజారెడ్డి, ఎస్సై గౌస్, తదితరులు ఉన్నారు.

## ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ విడుదల

భైంసా, జూలై 16: భైంసాలో తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఈ నెల 26, 27, 28వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అయిట్ల ప్రవీణ్, కోశాధికారి రమేశ్, పట్టణాధ్యక్షుడు పోశెట్టి, సభ్యులు కిశోర్, నిఖిల్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు భీమేశ్‌కు యువ పురస్కారం

సోన్, జూలై 16: నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ యువ కవి, కళాకారుడు శిల్పి పోలీసు భీమేశ్‌కు తెలంగాణ సారస్వత పరిషత్ రాష్ట్ర స్థాయి యువ పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన యువ కవి పోలీసు భీమేశ్ సారస్వత పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, చెన్నయ్య చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు. భీమేశ్ 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే తొలికవితా సంపుటిగాను యువ పురస్కారం లభించింది. రాష్ట్రస్థాయి యువ పురస్కారం పొందడంపై నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు అభినందించారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న మండల ప్రధాన కార్యదర్శి రాజు

బోథ్, జూలై 16: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కంటే ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట చెప్పొద్దన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మెడిచెల్మ ప్రవీణ్ పాల్గొన్నారు.

నేరడిగొండ, జూలై 16 : రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేపీ మండల కన్వీనర్ సాబ్లే సంతోష్‌సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నేరడిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ కోసం రైతులా కాదా అని చూడాలని, రేషన్‌కార్డు ఆధారంగా చూడడమేంటని ప్రశ్నించారు. పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు, రేషన్‌కార్డుకు సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాఘవులు, ప్రవీణ్, రాములు పాల్గొన్నారు.

## అదుపు తప్పి బ్రిడ్జిని ఢీ కొట్టిన లారీ

సోన్, జూలై 16: నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామం వద్ద బ్రిడ్జిపైన సోమవారం వేకువజామున ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా నుంచి నిర్మల్‌కు వెళ్తున్న లారీ అదుపుతప్పి బ్రిడ్జి రక్షణ గోడలను ఢీ కొట్టింది. దీంతో వాహనం నిలిచిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. లేకుంటే లారీ వాగులో పడి ప్రమాదం చోటు చేసుకునేది, ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

సోన్, జూలై 16: నిర్మల్‌లోని మంజులాపూర్‌లోని మంగళవారం సాయంత్రం పేకాట స్థావరాలపై నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాయికుమార్ పోలీసు సిబ్బంది దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని వారి నుంచి రూ. 53,180 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## 24 గంటల్లో దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

భైంసా, జూలై 16: 24 గంటల్లో దొంగతనం కేసును ఛేదించినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14వ తేదిన 11 గంటలకు మదీనా కాలనీ నుంచి ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించడంతో 15న మహ్మద్ ఉమర్ చౌహాన్ ఫిర్యాదు చేయగా వెంటనే దర్యాప్తు ప్రారంభించి సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి భోకర్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. నిందితుడు మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన నిఖిల్ రాజుగా గుర్తించి అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ కేసును 24 గంటల వ్యవధిలో ఛేదించినందుకు ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ సీఐ రాజారెడ్డిని, ఎస్ఐలు షరీఫ్, గౌస్‌ను అభినందించినట్లు ఆయన తెలిపారు.

## కొత్తగూడెంకు ప్రత్యేక బస్సులు

ఎదులాపురం, జూలై 16 : ఆర్టీసీ ప్రయాణికులతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామని డీఎం కల్పన తెలిపారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు డీఎస్సీ పరీక్షలు రాసేందుకు వెళ్తున్న అభ్యర్థుల సౌకర్యార్థం బస్సులను వేస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగూడెంలో చాలా మందికి అక్కడ సెంటర్ ఉండడంతో ఆర్టీసి బస్టాండ్‌లో కొత్తగూడెంకు బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నారు. ఈ నెల 22 సాయంత్రం 7 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సును వేయనున్నామని, తిరుగు ప్రయాణం కోసం అక్కడి నుంచి 23న సాయంత్రం బస్సు బయలు దేరనుందన్నారు.

## సంక్షిప్త వార్తలు

### • స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన పుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ కంపెనీలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

### • భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

### • అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వీటితో పాటు పలు అసంక్రమిత వ్యాధులకు కూడా ఇవి హేతువుగా మారుతున్నాయని తెలిపింది.

### • డ్యూటీలో ముస్లింలు గడ్డంతో ఉండటం తప్పుకాదు

చెన్నై: మతాచారాలకు అనుగుణంగా గడ్డం కలిగి ఉండటం తప్పేమీ కాదని, అలా ఉన్న పోలీసులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టవద్దని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం 1957 మద్రాస్ పోలీస్ గెజిట్ 1957ను ప్రస్తావిస్తూ ముస్లింలు విధి నిర్వహణలో గడ్డాలతో ఉండవచ్చునని, అయితే కత్తిరించిన, చక్కనైన గెడ్డాలతో ఉండాలని ఆదేశించింది. మక్కా నుంచి వచ్చిన తర్వాత గెడ్డంతో డ్యూటీకి హాజరైన ఒక కానిస్టేబుల్‌పై అధికారులు చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గడ్డంతో విధులకు హాజరవ్వటంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.

**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

**No. Y/C. 79/Catg/e-Auction/2024 తేది: 16-07-2024**

PUB/0687

దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్‌లో దిగువ తెలిపిన ప్రదేశాల కొరకు ఇ-వేలం ద్వారా టెండర్లు కోరుటకు సంబంధించిన ఆక్షన్ కేటలాగ్ దిగువ ఇవ్వబడినది.

| క్ర. సం. | కేటగిరి | కేటలాగ్ నం. | వివరాలు | వేలం తేది | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | మల్టీపూర్ పోస్ స్టాల్స్ | HYB-CATG-MPS-01 | కాచిగూడ కర్నూలు సిటీ బాసర | 31/07/24 | 11:00 | 11:50 |
| 2 | పార్కింగ్ | HYB-PRKG-037 | 04 స్టేషన్లు అనగా మలక్‌పేట్ (మెయిన్) అక్కన్నపేట్, గుండ్ల పోచంపల్లి & సఫిల్ గూడ రైల్వే స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్లు ఇచ్చుట | 27/07/24 | 11:00 | 12:00 |
| 3 | పార్కింగ్ | HYB-PRKG-036 | సిద్దిపేట రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ లాట్ ఇచ్చుట | 24/07/24 | 11:00 | 11:30 |

A0876 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్/హైదరాబాద్

# మళ్లీ చలో ఢిల్లీ

**మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు**

**శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు**
**డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు**
**బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ**

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.



### జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

### ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- 16 మంది ఆచూకీ గల్లంతు
- వీరిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాయ్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

### మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

## కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- పుణె పోలీసుల రహస్య ఆపరేషన్
- చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం

ముంబై, జూలై 16: వ్యవసాయ కూలీలుగా మారు వేషం ధరించిన పోలీసులు, పుణె చుట్టుపక్కల వాహనాల్ని దొంగలిస్తున్న ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. గత ఏడాది మార్చి-ఏప్రిల్‌లో పుణె పోలీస్ క్రైం బ్రాంచ్‌లోని ఏడుగురు సభ్యులు రహస్య ఆపరేషన్ చేపట్టి.. దొంగల ముఠాలో ప్రధాన వ్యక్తి అజయ్ రమేశ్ షిండేను పట్టుకున్నారు. దొంగతనం చేసిన 100 బైకులను స్వాధీనం చేసుకొని.. నెల రోజులపాటు ఆరా తీయగా, ఓ కామర్స్ గ్రాడ్యుయేట్ నేతృత్వంలో నలుగురు వ్యక్తులు గ్యాంగ్‌గా ఏర్పడి చేస్తున్న తతంగం బయటపడింది. దొంగలించిన వాహనాల్ని దారాశివ్, లాతూర్, బీడ్ జిల్లాల్లో గ్రామస్థులకు అమ్ముతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. రహస్య ఆపరేషన్‌లో భాగంగా కూలీలుగా మారిన పోలీసులు.. పొలాల్లో వంట చేసుకుంటూ, స్థానికులతో కలిసి కొన్ని సార్లు కూలి పనులకు కూడా వెళ్లారని తెలిసింది.




## యూపీలో ముదురు జంట ప్రేమ

**10 మంది పిల్లలున్న వ్యక్తితో ఆరుగురు సంతానం ఉన్న మహిళ జంప్**

కాస్‌గంజ్: ప్రేమ గుడ్డిది అంటుంటారు. ఇది యువత విషయంలో నిజమైనా.. తాము కూడా తక్కువ కామని యూపీలో ఒక ముదురు ప్రేమజంట నిరూపించింది. సాక్షాత్తూ పెళ్లయ్యి 10 మంది పిల్లలున్న వ్యక్తి... పెళ్లయ్యి ఆరుగురు సంతానం ఉన్న మరో మహిళతో కలిసి ప్రేమాయణం సాగించి ఇద్దరూ జంప్ కావడం ఆశ్చర్యమైతే.. ఆ మహిళ తన కుమారుడికాబోయే అత్త కావడం మరో ట్విస్టు. యూపీలోని కాస్‌గంజ్‌లో కూలిపని చేసుకునే వ్యక్తి, ఈ-రిక్షా డ్రైవర్‌గా చేసే షకీల్ 28 ఏండ్లుగా స్నేహితులు. తన కుమారుడికి అతని కుమార్తెనిచ్చి చేద్దామని షకీల్ అడగడంతో ఆయన కూడా అంగీకరించాడు. జూన్ 17న వివాహం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో షకీల్, స్నేహితుని భార్య తరచూ మాట్లాడుకునే వారు. ఈ లోగా ఇరు కుటుంబాలకు షాక్ ఇస్తూ జూన్ 3న షకీల్, పెళ్లికుమార్తె తల్లి(35) లేచిపోయారు. 10 మంది సంతానం ఉన్న షకీల్, ఆరుగురు పిల్లలున్న పెండ్లి కుమార్తె తల్లి ఇలా చేయడం చూసి బంధువులు, చుట్టుపక్కల వారు ముక్కున వేలుసుకున్నారు. కాగా, పెండ్లి కుమార్తె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారిద్దరూ ఈ ముదురు ప్రేమ జంట కోసం గాలిస్తున్నారు.

## సైబర్ నేరగాళ్ల నుంచి ఇలా రక్షణ!

### ఐఫోన్ యూజర్లకు యాపిల్ సూచనలు



న్యూఢిల్లీ, జూలై 16: సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో మోసగాళ్ల వలకు చిక్కకుండా ఉండేందుకు ఐఫోన్ వినియోగదారులకు యాపిల్ సంస్థ పలు సూచనలు చేసింది. ఈ మేరకు కంపెనీ సెక్యూరిటీ డాక్యుమెంట్‌ను అప్‌డేట్ చేసింది. యాపిల్ సూచించిన జాగ్రత్తలు ఇవీ..

1. మోసపూరిత ఈమెయిళ్లను గుర్తించేందుకు గానూ ఈమెయిల్‌కు స్పందించే ముందు అది ఏ మెయిల్ ఐడీ నుంచి వచ్చిందనేది ధ్రువీకరించుకోవాలి.
2. 'మీ ఫోన్‌లో సెక్యూరిటీ సమస్య ఉంది' అంటూ వచ్చే పాప్‌అప్ యాడ్లను క్లిక్ చేయవద్దు. ఇవి చాలా వరకు మోసపూరితమైనవి అయ్యే అవకాశం ఉంది.
3. 'యాపిల్ సపోర్ట్' పేరుతో మోసగాళ్లు ఫోన్లు, మెసేజ్‌లు చేయవచ్చు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
4. ఉచితంగా లేదా ఏదైనా బహుమతి వచ్చిందని వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.
5. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే 'క్యాలెండర్ ఇన్‌వైట్'లను తిరస్కరించాలి.
6. పాస్‌వర్డ్‌లు, సెక్యూరిటీ కోడ్‌లను తెలియని వెబ్‌సైట్‌లలో ఎంటర్ చేయొద్దు.
7. యాపిల్ ఐడీకి టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టుకోవాలి. కాంటాక్ట్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.
8. సాఫ్ట్‌వేర్‌ను కేవలం నమ్మకమైన మార్గాల్లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి.

## నీతి ఆయోగ్ పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, జూలై 16: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం మంత్రి మండలిలో మార్పుల తర్వాత మంగళవారం నీతి ఆయోగ్‌ను పునర్వ్యవస్థీకరించింది. ఇందులో చైర్ పర్సన్‌గా ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగుతారు. వైస్‌చైర్మన్, పూర్తికాల సభ్యుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవు. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కొత్త ఎక్స్ అఫీషియో సభ్యునిగా చేర్చగా, ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని నీతి ఆయోగ్‌లో భాగస్వాములను చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన కూర్పు తర్వాత సుమన్ కే బెర్రీ వైస్‌చైర్మన్‌గా, వీకే సారస్వత్, రమేశ్ చంద్, వీకే పాల్, అరవింద్ విర్మనీలు పూర్తికాల సభ్యులుగా కొనసాగుతారు.

## పూజా ఖేద్కర్ శిక్షణ నిలుపుదల



ముంబై, జూలై 16 (నమస్తే తెలంగాణ): ఇటీవల వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. అడ్డదారుల్లో ఆమె ఐఏఎస్ ఉద్యోగం సంపాదించారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ట్రైనీ ఐఏఎస్‌గా మహారాష్ట్రలో వెంటనే శిక్షణను నిలిపివేసి జూలై 23లోపు తిరిగి ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు వెనక్కి రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు పుణే కలెక్టర్ తనను వేధిస్తున్నారని ఖేద్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.